# పాత ఫైలు

*-వేదుల శకుంతల*

'మరొక అరగంటలో ఆఫీసు డ్యూటీ అయిపోతుంది! త్వరగా బయట పడాలి! లేకపోతే మళ్ళీ ఏదో పని పురమాయిస్తాడు, ఆఫీసర్ మహాశయుడు! రిటైర్‌మెంటుకి సిద్ధంగా వుండి సంసార బాధ్యతలన్నీ తీర్చేసుకున్న ఈ ఆఫీసర్ గారికి- ఇంటి దగ్గర మరొక పనేమీ లేక- ఆఫీసులో అసిస్టెంట్ల మీద అదనపు వర్కంతా రుద్ది... ఆనందిస్తూ వుంటారు- రెండు రోజుల లీవ్ తీసుకుంటున్నాను కదా అని- ఆ రెండు రోజుల పనంతా- హోమ్ వర్క్‌లా ఒప్పగిస్తాడు. నయం! ప్రయిమరీ స్కూల్ పిల్లల్లాగ ఇంపోజిషన్ వర్క్ చెప్పలేకపోతున్నారు- కాకపోతే... అప్పుడప్పుడు తప్పులు చూపించి... మళ్ళీ మళ్ళీ ఫైలు తయారు చేయమంటారు... అమ్మో! పరధ్యాసలో పొరపాట్లు దొర్లితే... అన్నంత పని చేయాలి...'

అనుకుంటూ సదానందం... త్వరత్వరగా ఫైలు రాసేసి... తాడు బిగించేసేయడం- "ఇదిగో దస్తగిరీ! ఈ ఫైలు అయ్యగార్కి అందజేయి. ఇప్పుడే వద్దు. మరొక ఐదు నిమిషాలు అయ్యాక... నేను సీటు మీద నుంచి లేచేక..."

"తెల్సు సార్! మళ్ళీ పెద్దయ్య పిలుపు ఇనేలోపు మీరు ఆఫీసు బయటపడాలి... నాకెరికే! కాని ఇయ్యాల ఆ భయ్యం లేదు సార్! అయ్యగోరి సిన్నప్పటి దోస్త్ వొచ్చిండు... ఓ ఒకటే ముచ్చట్లు- టీలు తాగుడు, టిఫెన్లు తినుడు... బాతాకానీ దంచుడు... ఓ బలే కుషీగ వున్నదు- ఆఫీసు గోల పట్టినట్టే లేదు... మీరు బేఫికర్‌గ ఉండ్రుండి!" అని టేబుల్ దగ్గరకొచ్చి రహస్యం చెప్పినట్టు చెప్తుంటే... సదానందం సడన్‌గ తన జిప్పు బాగ్ మీద చేయివేసి తడిమేడు- దస్తగిరి వెళ్ళిపోయేడు.

సదానందం జిప్ బాగ్ రెండు చేతుల మధ్యకి తీసుకుని ఆప్యాయంగా కర్చీఫ్‌తో రుద్ది మళ్ళీ టేబుల్ మీద పెట్టేడు-

మిగతా కొలీగ్స్- ఎవరి పనుల్లో వాళ్ళున్నారు.

పక్క సీటు ప్రసాద్‌రావు రెండు చేతులు పైకి ఎత్తి వెన్ను విరుచుకుంటూ- ఏదో చాలా కష్టపడిపోయి పని చేసేవాడిలాగ- భారం దించుకుంటున్నాడు. 'పనిదొంగ! ఫ్రెండ్స్‌తో పని చేయిస్తూ- బాస్ దగ్గర మెప్పులు పొందే ఘటికుడు! తనవల్ల ఒక్కడికి ఉపకారం ఉండదు కాని--- అందరి సహకారాలు తను దక్కించుకుంటాడు. వీడు ఫ్రెండా?!' అనుకుంటూ అప్రయత్నంగానే సదానందం జిప్ బ్యాగ్ మీద చేయి వేసి వేళ్ళతో తాళం వేసేడు-

స్నేహితుడు! ఎంత మంచి పదం!! ఎంత మధురం! స్నేహం అంటే వాడిదే! నేనూ వాడూ, ఎన్నాళ్ళయింది వాడిని చూసి?!?

మళ్ళీ జిప్ బ్యాగ్‌ని చేతుల మధ్యకి తీసుకుని మృదువుగా నిమిరేడు- "సదానందం గారు- ఫర్వాలేదు ఇంక లేవండి. పదండి పోదాం! ఐదు నిముషాలు ముందు పోతే ఏం కాదు. మీరు ఇందాకట్నుంచి బ్యాగ్ తీస్తున్నారు- మళ్ళీ వెనక్కి తగ్గుతున్నారు. చూస్తూనే వున్నా..." అని చిన్నగా నవ్వి- "అదుగో ఒక్కొక్కరే... షర్టులు- ప్యాంట్లు సర్దుకుంటున్నారు-- పదండి" అంటూ ఎదుటి సీట్లో- కోటేశ్వర్రావు- సీట్లో నుంచి లేచేడు.

సదానందం బ్యాగ్‌తో లేవడం- దస్తగిరి గబగబా వచ్చి టేబుల్ మీద ఫైలు కట్ట అందుకోటం- జరిగిపోయింది.

'హమ్మయ్య! ఫైలు లోపలికి వెళ్ళేలోపులో... ఆఫీసు నుంచి బయటపడ్డా' అనుకుని- సదానందం... చకచకా అడుగులు వేసేడు-

స్కూటర్ గేటు పక్కనే పార్క్ చేసి ఇంట్లోకి నడిచేడు సదానందం. "ఏమిటి ఆలస్యం? ఇవాళేనా, గంట పర్మిషన్ తీసుకుని వస్తారనుకున్నాను. మరీ ఆఫీసు పక్షండి మీరు!" సుజాత భర్తని మందలించే ధోరణిలో ఇంకా అంటోంది- "వారం రోజుల్నుండి, సెలవు తీసుకోడానికి ఆలోచిస్తూనే వున్నారు- ఆఫీసర్ ఏమంటాడో- వర్క్ పెరిగిపోతుందేమో- అని తెగ మధనపడ్డున్నారు-- మీ పక్క కొలీగ్స్ అంతమాత్రం సహాయం చేయరుటండీ? చేబదుళ్ళు-- లిఫ్ట్‌లు తెగ అడుగుతారు. కానీ- అవసరమైనప్పుడు, కొంచం వర్క్ చూసిపెట్టరా? ఇదేం ఫ్రెండ్సండీ? అయినా ప్రతిదానికీ మీరు భయపడతారు-- ఫ్రెండ్స్ ఇంటికి, బంధువుల ఇళ్ళకీ- ఫంక్షన్లకీ- వెళ్ళలేకపోతే ఇంకేమిటండీ? అవునూ ఇంతకీ స్కూటర్ అక్కడే పెట్టారు మళ్ళీ బయటికి వెళ్ళాలా?"

"అవును సుజా! ప్రెజెంటేషన్ కొనాలి గదా? ఆఫీసు నుంచి వచ్చేటప్పుడే కొందామనుకున్నాను- నాకన్నా నీ సెలక్షన్ బాగుంటుందని... నిన్ను తీసుకుని వెళదామని వచ్చాను" అన్నాడు సదానందం- కుర్చీలో కూర్చుంటూ-

సుజాత కొద్దిగా గర్వంగా ఫీలవుతూ- "ఆ! నా ముఖం! అయినా మీ ఫ్రెండ్‌కి ఏది ఇస్తే బాగుంటుందో- నాకన్నా మీకే బాగా తెల్సు! వస్తున్నానుండండి. మీకు టీ తీసుకు వస్తాను. మీరు తాగుతూంటే- నేను చీర మార్చుకుని వస్తాను"- చెప్పినంత వేగంగా లోపలికి వెళ్ళి- ఫ్లాస్కులో టీ కప్పులోకి వొంచి- నాల్గు బిస్కెట్లు సాసర్లో పెట్టి- మళ్ళీ అంత వేగంగానూ-- ముందు గదిలోకి వచ్చి- భర్తకి అందించింది.

సదానందం చేతిలో జిప్ బ్యాగ్‌ని, కళ్ళ నిండా వెలుగు నింపుకుని అభిమానంగా చూసి పక్కనున్న టేబుల్ మీద పెట్టేడు-

నవ్వింది సుజాత.

"మీ ఫ్రెండ్ మోహన్‌రావు పంపిన ఇన్విటేషన్- వారం రోజుల క్రిందట వచ్చింది- అప్పట్నుంచి మీరు-- దాన్ని ఆ బ్యాగ్‌లో పెట్టుకుని- అతన్నే చూస్తున్నంత తృప్తిగా ఫీలవుతున్నారు- సెలవు దొరికింది గనక సరిపోయింది గానీ- లేకపోతే, ఆ బ్యాగ్‌ని నిద్రలో కూడా వదిలేలా లేరు. పోనీ ఆ ఇన్విటేషన్ కార్డు బయటికి తీసి మడిచి షర్ట్ జేబులో పెట్టుకోండి-"

ఈసారి సదానందం నవ్వేడు.

"అలా చేస్తే-- నల్గురు ఏమిటని అడుగుతారు-- ఆట పట్టిస్తారు-" "అందుకని బ్యాగ్‌లో దాచి- ఆ బ్యాగ్‌ని ప్రేమగా చూసుకుంటున్నారు- మీ ఫ్రెండ్ చాలా అదృష్టవంతుడు- ప్రేమికుడు, ప్రియురాలి ఫోటో కూడా ఇంత భద్రంగా దాచుకుంటాడో లేదో...?" అంది ఓరగా చూసి.

"జెలసీ!! నిన్నూ భద్రంగానే చూసుకుంటున్నానోయ్! పెళ్ళయిన కొత్తల్లో నీ లెటర్స్‌నీ ఇలాగే-- హేండ్ బాగ్‌లో దాచుకుని- రాత్రిళ్ళు తలగడ క్రింద పెట్టుకుంటే- మా అక్కయ్యా... తమ్ముడు వాళ్ళు--- ఎన్ని ఆటలు పట్టించారో తెలుసా?"

"ఆ! ఆ! తెలుసు! ఇప్పుడు అవన్నీ గుమ్మరించకండి- ఆ టీ చల్లారిపోతోంది తాగండి- నేను వచ్చేస్తున్నా" అనేసి లోపలికి వెళ్ళిపోయింది.

సదానందం టీ కప్పు చేతిలోకి తీసుకుని- బిస్కెట్లు తింటూ అనుకున్నాడు- చిన్నపిల్లలిద్దరూ దసరా సెలవలకి వాళ్ళ మామయ్య గారి ఊరికెళ్ళారు- సుజాతతో తను కలిసి, హైదరాబాద్ వెళ్ళి వస్తే-- మళ్ళీ ఆనాటి స్మృతులు నెమరు వేసుకోవచ్చును కదా? ఎంతైనా హైస్కూలు చదువుల్లో వున్న- పద్మ, పద్నాలుగేళ్ళది- అమ్మా నాన్నా ఫీలింగ్స్ అది కనిపెట్టేయగలదు- రవి పదేళ్ళున్నా... పిడుగు!! సినిమాలు, సీరియల్స్ నాలెడ్జి చాలా బాగా వుంది! వాడి దగ్గర చాలా జాగ్రత్తగా వుండాలి... అనుకోకుండా మోహన్‌రావు ఇలా ఆహ్వానించడం- మేము బయల్దేరడం-- ఇదొక ఛాన్సు! పెద్దాడు వరంగల్‌లో బి.యి. చదువుతున్నాడు! కప్పు కింద పెట్టేసరికి సుజాత కుచ్చెళ్ళు సరిచేసుకుంటూ వచ్చేసింది. ఇంటికి తాళం వేసి స్కూటరెక్కి బయలుదేరేరు!

చక్కని ప్రజంటేషన్... అతి తక్కువ టైమ్‌లో కొనేసి ప్యాక్ చేయించి ఇంటికి వచ్చారు- సుజాత తీరే వేరు! ఏ పనైనా... చురుకుగా... త్వరత్వరగా ముగిస్తుంది. అందుకే ఎన్నో విషయాల్లో సదానందం, సుజాతతో సంప్రదించకనే చేస్తాడు. రాత్రి బస్సెక్కి, పూరీ కూరా టిఫిన్ బాక్స్‌లో సర్ది- మొత్తం సామాను ఒక ఎయిర్ బాగ్‌లో వచ్చేసేలాగ, లగేజి ఎక్కువ లేకుండా చేసింది సుజాత.

సీట్లు వెతుక్కుని... స్థిమితంగా కూర్చున్నారు- బస్ కదిలింది! నైట్ ఎక్స్‌ప్రెస్... తెల్లవారకుండా హైదరాబాద్ వెళ్ళిపోతుంది. కాస్సేపు కబుర్లు చెప్పి... వెనక్కి జార్లబడి నిద్రలోకి జారిపోయింది సుజాత. ఊరి పొలిమేరలు దాటగానే... లైట్లు ఆఫ్ చేసేడు కండక్టర్, క్యాసెట్ రికార్డ్ ప్లేయర్ ఆన్ చేసేడు. నిద్రావటం లేదు, సదానందానికి.

ఆనాటి జ్ఞాపకాలు... తెరలు తెరలుగా కదులుతున్నాయి...

'ఆనాడు... పన్నెండు ఏళ్ళ క్రితం-- హైదరాబాద్‌లో ఎర్రమంజిల్‌లో ఒక ఇంట్లో అద్దెకుండేవాళ్ళు! పక్క పోర్షన్‌లో మోహన్‌రావు వుండేవాడు- వాడికి అప్పుడు ఇద్దరు పిల్లలు- తమకీ ఇద్దరు పిల్లలు- పెద్దాడు హరికి ఏడేళ్ళు... పద్మకి రెండేళ్ళు... వాడి పిల్లలకీ అంతే! పెద్ద కొడుకు చంద్రానికి ఏడేళ్ళు- రెండోవాడు సూర్యానికి రెండేళ్ళు! రెండు కుటుంబాలు ఎంతో బాగా కలిసిపోయాయి. వాళ్ళావిడకి కొంచెం మాట తొందరే తప్ప మనసు మంచిది! పేరు రాధారమణే కాని రాధగానే పల్కేది. మోహన్‌రావు ప్రయివేటు కంపెనీలో... సనత్‌నగర్‌లో పనిచేసేవాడు... తనది పోస్టల్ డిపార్ట్‌మెంట్! మొదట ఒక్క పిల్లాడితో వాళ్ళ ఫామిలీ-- అదేవిధంగా హరి ఐదేళ్ళ పిల్లాడుగా తమ ఫామిలీ అద్దెకి దిగేరు... తర్వాత, వాళ్ళకి సూర్యం, తమకి పద్మ

పుట్టేరు- అంటే మూడు సంవత్సరాలు ఒక్క ఫ్యామిలీగా కలిసిపోయాం! పండుగలు, పబ్బాలు, పిక్‌నిక్‌లు, ఎక్స్‌కర్షన్‌లు, సినిమాలు, షికార్లు, షాపింగ్‌లు... ఒకటేమిటీ... అన్నిరకాల సరదాలు- బాగా ఎంజాయ్ చేసేం. నాలుగు రోజులు వాడు క్యాంపుకి వెళితే- తనకి తోచేది కాదు. తను రెండు రోజులు ఊరికెళితే వాడుండలేక పోయేవాడు- ఒకసారి వాళ్ళమ్మ గార్కి ఒంట్లో బాగులేదని తెలిసి గుంటూరు వెళ్ళేరు వాళ్ళంతా! ఎండాకాలం. చాలా వేడిగా వుంటోంది. పగలంతా తను ఆఫీసులో ఉంటే- సుజాత, పసిపిల్లతో, హరితో ఇంట్లో మహా చిరాకు పడేది. ఫ్యాన్ గాలి వేడెక్కిపోయి... ఊదరగొట్టేది.

ఒకరోజు వంట చేసేసి- ఇంట్లో చాలా ఉడికెత్తిపోతోందని చల్లగాలికి బయటికి వెళ్ళి వద్దామంది. హరిగాడు ఎక్కడో ఆడుతున్నాడు- ఒక గంటలో వస్తామని వాడికి చెప్పి- చంటిదాన్ని చంకనేసుకుని బయల్దేరింది సుజాత. ఎర్రమంజిల్ వెనుక పద్మావతినగర్... వెంకటరమణ నగర్ అప్పుడప్పుడే అభివృద్ధి చెందుతున్న కాలనీలు. అయితే మధ్యన అంతా రాళ్ళగుట్టలు... కాలిబాట... అక్కడక్కడ ఇళ్ళు తప్ప- రాత్రి పడితే... నిర్భయంగా నడవటానికి జంకేవారు జనం!

కాస్సేపు చల్లగాలికి కూర్చుని వెళ్ళిపోదామనుకుని తనూ, సుజాత- ఓ రాయిమీద కూర్చున్నారు... చంటిపిల్ల ఒళ్ళో పడుకుని నిద్రపోయింది. ఏదో పిచ్చాపాటి కబుర్లు చెప్పుకుంటుంటే... ఉహూ! చేదు జ్ఞాపకం! మనసు కలత పడిన సన్నివేశం... ఇన్నాళ్ళకి మళ్ళీ గుర్తు తెచ్చుకోవటం... ఎందుకులే... అనుకుంటుండగానే బస్సు సడన్ బ్రేక్‌తో ఆగింది- అంతా ఉలిక్కిపడి లేచారు.

బస్సులో లైట్లు వెలిగాయి.

ఏ ఊరు లేని చోట ఎందుకు ఆగింది బస్సు అని అందరూ కిటికీలు తెరిచి చూసేరు. కండక్టర్- డ్రైవర్ దగ్గరికి వెళ్ళి ముందుకు చూసేడు-

రోడ్డుకు అడ్డంగా ఒక గేదె పడుకుని వుంది-

కండక్టర్ దిగేడు. మరికొంతమంది దిగేరు. దాన్ని లేవగొట్టి- దాని తాలూకు యజమానిని- తిట్టగల్గినన్ని తిట్లు తిట్టేరు. అంతా మళ్ళీ బస్సు ఎక్కారు, బస్సు కదలడం జరిగింది-

"మరొక అర్ధగంటలో హాల్ట్ ఉంటుంది. భోజనాలు, టిఫిన్లు కానిచ్చుకోవచ్చును"- అని లైట్లు ఆఫ్ చేసేడు కండక్టర్.

సుజాతకి నిద్ర తేలిపోయింది.

చెవుల మీదుగా చీర చెంగు కప్పుకుని- వెనక్కి వాలి హైదరాబాద్‌నీ, గతంలోని అనుభవాలనీ తలుచుకుంటూ- మధ్య మధ్య క్యాసెట్‌లో వినిపిస్తున్న పాటని వింటోంది. సదానందానికి హైదరాబాద్ వెళుతున్నందుకు సంతోషంగా వుంది, మరొకవైపు- ఆశ్చర్యంగానూ వుంది. మోహన్‌రావు కొత్త ఇల్లు కట్టుకుని గృహప్రవేశానికి రమ్మని ఇన్విటేషన్ పంపాడు. ఎంత అదృష్టవంతుడు!? ఎర్రమంజిల్‌లో ఉన్నప్పుడు అద్దె కొంపల్లో ఉండేవాళ్ళం! మేము ఇలా రామగుండం ట్రాన్స్‌ఫర్ మీద వచ్చేసేక- అప్పుడప్పుడు ఉత్తరాలు రాసుకోడం- ఎప్పుడైనా కల్సుకోడం తప్పించి- ఎక్కువగా ఉద్యోగ బాధ్యతల్లో మునిగిపోయాం! వాడు ఆ పరిసరాల్లో స్థలం కొనుక్కున్న సంగతి కూడా తెలియలేదు. ఇప్పుడు ఇల్లు కూడా- లోను మీద కట్టేసుకుని హాయిగా కొత్త ఇంటి గృహప్రవేశం చేసుకుంటున్నాడు. ప్రయివేటు కంపెనీ కనుక- మరొక ఊరు కదలక్కర్లేదు- నాకు అలాంటి అదృష్టం లేదు. ట్రాన్స్‌ఫర్ అయిందంటే మూటాముల్లె సర్దాలి! పిల్లల చదువులు కూడా పాడవుతున్నాయి. అందుకే హరిని వరంగల్‌లో ఇంజనీరింగ్‌లో చేర్పించి- కోర్సు పూర్తి అయేవరకు- కదలక్కర్లేకుండా- రూమ్ అద్దెకు తీసుకుని ఫ్రెండ్‌తో కలిసి ఉండేలాగ ఏర్పాటు చేసేను-' సదానందం సీట్లో సరిగా సర్దుకుని కూచుంటూ, సుజాతవైపు చూసేడు-

"నిద్ర అయిపోయిందా?" అడిగేడు.

"కొత్త ఇల్లు ఎలా వుంటుందా అని కలగంటున్నా" అంది.

"మోహన్‌రావుదా? లేక మనం కట్టుకుంటే ఎలా వుంటుందా అనా?"

"రెండూనూ! ఇప్పుడు అన్నీ ఫ్లాట్లే కదా?"

''నిజమే! వాడు స్థలం కొన్నాడు గనుక ఇండిపెండెంట్‌గా కట్టుకున్నాడు- మనమైతే ఫ్లాటు కొనుక్కోవాల్సిందే! చూద్దాం...'' కొనుక్కుంటే బాగుంటుందన్న ఆలోచన సదానందానికీ కల్గింది, ఆ క్షణంలో...

బస్సు ఆగింది! భోజనాలు, టిఫెన్లు... ఆరగించారు ప్యాసెంజర్లు- మళ్ళీ బస్సు బయల్దేరగానే... సదానందానికి, సుజాతకి కూడా మెల్లగా నిద్ర పట్టేసింది!

★★★

చీకట్లు విడకుండానే బస్సు హైదరాబాద్ చేరింది.

ఆటో చేసుకుని... ఎర్రమంజిల్ వెనుక, పద్మావతీనగర్‌కి చేరేరు-

"పన్నెండేళ్ళ తర్వాత... అబ్బ ఎంత మారిపోయిందో కాలనీ? సందు లేకుండా ఇళ్ళు, అపార్ట్‌మెంట్సు వెలిసేయి- ఎక్కడ మోహన్‌రావు ఇల్లు ఏదీ?" జేబులో నుంచి కార్డు తీసి ఎడ్రసు చూసేడు సదానందం.

"ఆ అదుగో అదే అక్కడ ఆపు" అన్నాడు మరొక ఇరవై గజాల దూరంలో ఉన్న ఇల్లు చూపిస్తూ!" కొత్త మోడల్‌గా వుంది ఇల్లు! చుట్టూ ఎక్కువ స్థలం లేదు.

అయినా, షామియానా... మామిడి తోరణాలు.. నీటుగా సర్దిన కుర్చీలు... పిల్లలు పెద్దలు... హడావిడిగా తిరుగుతున్నారు. ఆటో దిగి బిల్లు ఇచ్చేసి ఎయిర్‌బ్యాగ్, భుజానికి తగిలించుకుని సదానందం షామియానాలోకి నడిచేడు- సుజాత భర్తని అనుసరించింది-

"ఒరేయి ఆనందం--" ఓ మూల నుంచి గట్టిగా పిలుస్తూ మోహన్‌రావు కుర్చీల మధ్య నుంచి వచ్చాడు- పట్టు పంచ, పైన పట్టు కండువా... తలంటుకున్న మోహన్‌రావు కొత్త అందంతో- నిండుగా కనిపించేడు-

"ఒరేయ్ మోహనం! ఎంత మారిపోయావురా? ఈ కాలనీ కూడా చాలా మారిపోయింది. గుర్తు పట్టలేకపోయా!" కౌగిలించుకున్నాడు సదానందం.

"మారదురా మరి? మనం మారలేదూ? ఏమ్మా చెల్లాయ్ ఏమిటి అంత చిక్కిపోయావు? అవునూ పిల్లలేరి?"

"వాళ్ళు మామయ్య గారింటికి వెళ్ళేరు- ఇంతకీ మా రాధమ్మ ఎక్కడ?" బ్యాగ్ భుజాన్నుంచి చేతుల్లోకి మార్చుకుంటూ అడిగేడు సదానందం...

వస్తుంది వస్తుంది- పాత ఇంట్లో... పూజ సామానులన్నీ సర్దుతోంది. బ్రాహ్మణుడు దగ్గరుండి సర్దిస్తున్నాడు- ఇంక అర్ధగంట టైమ్ వుంది- ఇంతలో మీరు- ముఖాలు కడుక్కుని స్నానాలు చేయండి- ఇదుగో ఆ పక్క అపార్ట్‌మెంటులో సెకండ్ ఫ్లాటు అడిగి తీసుకున్నాం! ఒరే రంగా రంగా ఇదిగో ఇలారా! ఆ! ఈ అంకుల్ వాళ్ళని మనం తీసుకున్న ఫ్లాటుకి తీసుకువెళ్ళు. ముఖాలు కడుక్కోగానే ముందు కాఫీలు ఇప్పించు- వెళ్ళండిరా! వీడు తీసుకువెళతాడు-'' అంటూ మోహన్‌రావు వాళ్ళిద్దరినీ పదేళ్ళ కుర్రాడితో ఎదురుగా వున్న అపార్ట్‌మెంటుకి పంపించాడు-

ఆ ఫ్లాటు ఓనర్సు ఒక గదికి తాళం వేసుకుని మిగిలిన ఇల్లంతా మోహన్‌రావుకి ఇచ్చి ఊరికెళ్ళారు... సదానందం, సుజాత బ్రష్‌లు తీసుకుని బాల్కనీలోకి వెళ్ళారు... కిచెన్‌లో వంటవాళ్ళు కాఫీ... టిఫిన్లు తయారుచేస్తున్నారు. బాల్కనీలో నుంచుని బ్రష్ చేసుకుంటున్న సదానందం- అటు ఇటు పరికించి చూసేడు- ఒకప్పుడు- చిన్న చిన్న రాళ్ళతో గుట్టల్లా... సరి అయిన దారిలేక కాలిబాటలా వుండే ఆ ప్రదేశమంతా... అపార్ట్‌మెంట్సుతో... చక్కని రోడ్డుతో... గుర్తు పట్టలేనంతగా మారిపోయింది. ఒక అపార్ట్‌మెంటులో ఫ్లాట్సుకి మరొక అపార్ట్‌మెంటులో ఫ్లాట్సు ఎదురెదురుగా కనిపిస్తున్నాయి. కిటికీలు- గుమ్మాలు అన్నీ- కర్టెన్సు వేసుకుంటే తప్ప-- ఆ ఇంట్లో మనుష్యులు... ఈ ఇంట్లోకి స్పష్టంగా కనిపిస్తున్నారు.

సదానందం, తువ్వాలుతో ముఖం తుడుచుకుంటూ రంగ అందించిన కాఫీ తాగుతూ పక్క గదిలోకి వెళ్ళాడు- కిటికీలో నుంచి చూస్తూ కాఫీ తాగుతుండగా పక్క ఫ్లాటులోని బెడ్ రూమ్‌లో ఒక పెద్ద మనిషి కుర్చీలో కూర్చుని ఉన్నాడు. లేవలేక కర్ర ఆసరాతో ప్రయత్నిస్తున్నాడు- అప్పుడే గదిలోకి వచ్చిన మనమరాలు 'ఎందుకు లేస్తున్నావ్ కూర్చో--' అని గదమాయిస్తోంది.

సదానందానికి ఆ పెద్ద మనిషి ముఖం బాగా కనిపిస్తోంది... ఎక్కడో... ఎప్పుడో... చూసినట్టుంది! నుదుటిమీద పెద్ద చారికలాంటి మచ్చ... ఎక్కడా... ఎక్కడా?...

"ఏమండీ త్వరగా స్నానం చేయండి... ముహూర్తానికి అందరూ వెళుతున్నారు" సుజాత తొందర చేసింది...

గబగబా స్నానాలు కానిచ్చి... తయారై కొత్త ఇంటికి వెళ్ళేరు...

అప్పటికే... గుమ్మడి కాయలు కొట్టి, కొబ్బరికాయలు కొట్టి... లోపలికి వెళ్ళేరు మోహన్‌రావు దంపతులు... లోపల తంతు జరిపిస్తున్నాడు బ్రాహ్మడు- చుట్టాలు స్నేహితులు చాలామందే వచ్చారు... వ్రతం పూర్తి అవగానే, టిఫిన్లు అందించారు... సదానందం, కాస్సేపు విశ్రాంతిగా కూర్చుందామని ఫ్లాటుకి వచ్చాడు- సుజాత- కొత్త ఇంట్లోనే ఉండిపోయింది.

సదానందం- గదిలో కిటికీ దగ్గర నిలబడ్డాడు-

ఆ పెద్దమనిషి అలా ఆ కుర్చీలోనే కూర్చున్నాడు- పక్క ఫ్లాటులో వాళ్ళు కనిపిస్తున్నా కర్టెన్ వేయని కిటికీ తలుపులు అలా తెరిచే వుంచారు, వెలుగు కోసం-- సదానందానికి చటుక్కున మెరుపులా గుర్తువచ్చింది.

'ఆ! అవును- ఆనాటి పెద్ద మనిషే! అప్పటి ఇల్లు... ఇప్పుడు అపార్ట్‌మెంటులా మారిందన్న మాట!? ఆనాటి చేదు జ్ఞాపకం... వద్దనుకున్నా స్మృతిలో మెదిలింది- ఎండాకాలం. కాస్సేపు చల్లగాలి కోసం, చంటి పిల్లని చంకన వేసుకుని నేను సుజాత ఎదురెదురుగా రాయిమీద

కూర్చున్నాం... కబుర్లు చెప్పుకుంటున్నాం!

ఇంతలో... ఆ కాలిబాటకి అవతలవైపు ఓ యాభై గజాల దూరంలో... ఒక ఇంటి గేటు దగ్గర ఓ పెద్ద మనిషి నిల్చుని గట్టిగా ఏదో అంటున్నాడు- ఎదురుగా పాలవాడు పాలు కొలిచి పోస్తున్నాడు... ఇంటి ముందు లైటు వేసి వుంది. పక్కన ఇంకా ఎవరో ఇద్దరు ముగ్గురు ఆడవాళ్ళు ఉన్నారు... మొదట ఆ పాలవాడిని ఏదో అంటున్నారేమో అనుకున్నాడతను! కానీ తమవైపు చేయి చూపిస్తూ... అంటున్నాడు... ఆ పాలవాడు సైకిల్ తీసుకుని తమ వద్దకి వచ్చి-- "బాబూ, మీరు మరొక చోట కూర్చోండి. వారి ఇంటి ఎదురుగా ఇలాగా (న్యూసెన్సుగా) వుంటే బాగాలేదుట!" అన్నాడు.

ఆ పెద్ద మనిషి కూడా గట్టిగా అరిచేడు- తర్వాత దగ్గరికి వచ్చాడు- "మేము లైటు తీసేసుకోవాలా? తలుపులు మూసేసుకోవాలా? ఇంకో చోటు కనిపించలేదా మీకు?"-

ఏమి వింటున్నామో ఒక్క నిముషం అర్థం కాలేదు తమకి?!

తర్వాత... అవమానం భరించలేక చటుక్కున లేచి ఇంటికి వచ్చేసేం! 'మేమేదో.. ప్రేమికులమా? రొమాంటిక్ సీన్సు క్రియేటు చేస్తున్నామా? అయినా... వాళ్ళకేదో అభ్యంతరంగా వున్నట్టు- తమ ఇంటికి యాభై గజాల దూరంలో... అవతల రాళ్ళమీద కూర్చుంటే... అతనికి ఇబ్బందిగా వున్నట్టు మాట్లాడేడు- ఏమిటీ దారుణం? అనుకున్నా... ఆ చేదు నిముషాల జ్ఞావకం వచ్చినప్పుడల్లా- తనకీ, సుజాతకీ- మనసంతా కలతపడిపోయేది, ఆరోజుల్లో... తర్వాత హైదరాబాద్ నుంచి ట్రాన్స్‌ఫరై వెళ్ళిపోయినా... ఎప్పుడైనా తనకి ఆ సంఘటన గుర్తుకు వస్తే... 'పాత ఫైలు.. తిరగేసి అండర్‌లైన్ చేసిన... రిమార్క్‌ని' చూసినట్టు- గుండెల్లో గుచ్చినట్టు అవుతుంది!


మళ్ళీ ఇన్నాళ్ళకి... ఆ ముఖం... నుదుటిమీద చారిక లాంటి మచ్చ... అవును... అప్పట్లో... ఖాళీగా ఉండే మైదానంలో... ఎవరిళ్ళు లేనప్పుడు- ఆయనదొక్కటే ఇల్లు ఉండేది. ఇప్పుడు సందులేనన్ని అపార్టుమెంట్సు వెలిసేయి. అతని ఇల్లు కూడా... బహుశా కొడుకులు అపార్ట్‌మెంట్సులా మార్చేసి వుంటారు.

వయసు పైబడింది- షుగర్, బి.పి. లాంటివో ఇంకా ఏమైనా కంప్లయింట్స్ వచ్చే వుంటాయి! అందుకే... ఈ గదిలో అలా పడి వున్నట్టున్నాడు! ఇప్పుడు ఎవర్ని ఏమీ అనలేడు! పక్క ఫ్లాటు వాళ్ళని తలుపులు మూసుకోండని గానీ, మీరు అటు పక్కకి కూర్చోండి అని గానీ అనలేడు... అనడానికి వీలులేదు! ఎవరింట్లో వాళ్ళ ఇష్టం! తలుపులు తెరుచుకున్నా... లైట్లు వేసుకున్నా... రికార్డులు వేసి డాన్సులు చేసుకున్నా... మిగతావారు ఏమీ అననప్పుడు... ఆయన ఒక్కడు ఏమి అనలేడు, అనినా ఎవరు పట్టించుకోరు! కనుక--

ఓ పెద్ద మనిషీ-- ఇప్పుడేమి చేయలేవు... ఎవర్ని ఏమీ అనలేవు... సదానందానికి ఎందుకో-- మనసులో ఎక్కడో... చిన్న ఓదార్పు లాంటిది కల్గింది...

"ఏమండీ! మిమ్మల్ని మా మోహన్ బాబాయ్ తీసుకు రమ్మంటున్నాడు రండి" అంటూ రంగ వచ్చాడు- సదానందం కదిలి వెళ్ళేడు కొత్త ఇంటికి-

మోహన్‌రావు... లోపలి కార్యక్రమాలన్నీ ముగిసి-




బయట కుర్చీల్లో కూర్చుని- బంధువులతో మాట్లాడుతున్నాడు-- సదానందం రాగానే అందరికీ పరిచయం చేసి- "ఒరేయ్- నువ్వు కూడా ఇక్కడ ఫ్లాటు కొనుక్కోరా! స్థలం కొని ఇల్లు కట్టుకోవచ్చును అనుకో... అది త్వరగా జరిగే పని కాదు. కానీ, ఫ్లాటంటే... ఈ క్షణంలో బేరం కుదిరిపోతుంది. ఇప్పుడు మనం తీసుకున్న ఆ ఫ్లాటు వాళ్ళు దాన్ని అమ్మేద్దామనుకుంటున్నారు... వాళ్ళు వనస్థలిపురంలో పెద్ద ఇల్లు కట్టుకుంటున్నారు... అందుకని ఇది అమ్మేస్తాం అని నాకు చెప్పారు. రెండేళ్ళు అయింది, వాళ్ళు కొని... కొత్తదే చూసేవు గదా? కొనేసుకో! నాకు దగ్గర్లో వుంటావు... ఎన్ని ఊళ్ళు తిరిగినా... ఇక్కడ నీకు సొంత ఇల్లు ఉంటుంది-" అన్నాడు ఉత్సాహంగా.

తను నవ్వి ఆలోచనలో ఉండగా... "చెప్పండి మీరు కాదంటే... మేము కొనుక్కుందామనుకుంటున్నాం-" అని తొందరపెట్టేడు అక్కడే వున్న ఒకాయన.

"మీరు ఆగండి- మా ఆనందం కొంటాడు"- అని మోహనరావు అడ్డుకున్నాడు- ఆ తర్వాత మామూలు విషయాలు- ఎన్నో మాట్లాడుకుని భోజనాలకి లేచేరు-

"అన్నయ్యా! మీరు ఇచ్చిన ప్రెజంటేషన్ ఎంతో బాగుంది... మా బెడ్ రూంలో దాచుకుంటాను- రాధాకృష్ణులు వున్న బొమ్మంటే నాకు మక్కువ. అది సరే మళ్ళీ బట్టలెందుకు పెట్టేరు? సుజాత పనే ఇది అవునా? సరే. కాని మీరు ఫ్లాటు కొంటున్నారు, నేను సుజాత డిసైడ్ చేసేసేం! రేపు వాళ్ళు ఊరు నుంచి వస్తారు మాట్లాడేద్దాం" అని సాయంత్రం అందరూ టీ తాగుతున్నప్పుడు- రాధారమణి ఊదరగొట్టేసింది. సుజాత ముఖంలో ఉత్సాహం చూసి- 'సరే' అన్నట్టు తలాడించేడు సదానందం. ఆతర్వాత రాత్రి ఫ్లాటులో చుట్టాలంతా పడుకున్నప్పుడు- సదానందం కిటికీ దగ్గరకి తీసుకెళ్ళి- పక్క అపార్ట్‌మెంటులో- ఫ్లాటులో... కిటికీలో నుంచి కనిపిస్తున్న ఆ పెద్ద మనిషిని చూపించి... "నిద్రపోతున్నాడు. గుర్తుపట్టలేవు- ఆనాటి మన చిన్నపాటి సరదాని చితక్కొట్టి... నలిపేసిన పెద్దమనిషి!" అని జ్ఞాపకం చేసేడు.

సుజాత విచిత్రమైన అనుభూతి పొందింది!

"ఈ ఫ్లాటు మనం తప్పకుండా కొందాం! ఈ ఉగాది పండుగ నాటికి ఈ ఇల్లు మనం సొంతం చేసుకుందాం! ఈ గది మన బెడ్ రూం అవుతుంది! వీలైనప్పుడు అతన్ని పలకరించి- బాబూ! మీరు నాకు తండ్రిలాంటి వారు. ఒక విషయం చెప్తాను- వినండి, జీవితంలో ఎన్నో మార్పులు వస్తూ వుంటాయి. అవకాశం, అధికారం ఉంది గదా అని పక్కవాడిని హర్టు చేయకండి! అది మనకి ఎప్పుడో ఒకప్పుడు- తెరచి చూసుకున్న పాత ఫైలులా... గతం తాలూకు గాయంలా కనిపిస్తుంది! అని చెప్పాలని వుంది సుజాతా!" అన్నాడు.

భర్త మాటలు వింటున్న సుజాతకి... రాబోయే వసంతకాలం ముందే వచ్చేసి చేదు రుచుల మధ్య- తీపి తలపులు... కలిపి మనసుని తృప్తిపరచినట్టు అయింది!! ●